


# చిరిగి బాల్యం

శ్రీవాజు, అంగర
వెంకట శివప్రసాదరావు

'సత్తిరాజా!'

తురాయి చెట్టు కింద మోకాళ్ళ చుట్టూ చేతులు వేసి కూర్చుని ఎండలో ఆకుల మచ్చల్ని లెక్కపెడుతున్న సత్తిరాజుకి ఆ పిలుపు వినిపించలేదు.

మరొక నిమిషం తరవాత మళ్ళీ -

'సత్తిరాజా!'

ఈ సారి సత్తిరాజు తల ఎత్తి చుట్టూ చూశాడు. కనుచూపుమేరలో ఎవరూ కనిపించలేదు. ఎండ తీవ్రత హెచ్చుగా ఉంది. తల ఎత్తి మీదకు చూశాడు. సత్తిరాజుకి పైనెవరూ కనిపించలేదు. మరో మారు దిక్కులు చూశాడు. లేరు. ఎవరూ లేరు. తను ఒక్కడే ఉన్నా డక్కడ.

స్కూలు వదిలిపెట్టే అర గంట అయింది. ఎండ వేడికి సత్తిరాజుకి జ్వరం పుట్టుకొచ్చింది.

'సత్తిరాజా!' మళ్ళీ అదే పిలుపు.

ఈసారి సత్తిరాజు తల ఎత్తలేదు. సత్తిరాజుకి తెలుసు ఆ పిలిచే దెవరో. మౌనంగా ఊరుకున్నాడు.

"సత్తిరాజా, మీారు రాజులా?"

"కాదు." సత్తిరాజు సమాధానం పైకే అన్నాడు.

"మరి మీా దే కులం?"

"గుడిసె కులం."

"అదేవిటి!"

"అదంతే. మా యమ్మ సెప్పింది."

"నాకు తెలవనేదు."

"నీ కేటి ... నా కేటి ... మన్ని పుట్టించినోడికూ్కడ తెలవ దంటుంది మా యమ్మ. కారుల్లో తిరిగి, బంగళాల్లో బతికేవోళ్ల దో కులంట.

గుడ సెల్లా బతుకుతూ, గంజినీళ్ల క్కాడ నోసుకోవి మా దో కులంట.

అటుకీ, ఇటుకీ సెందని వాళ్ల దో కులంట. ఇదంతా మా యమ్మే సెప్పింది. నా కేటీ తెల్దు."

"మీ యమ్మ సదువుకుందా?"

"మా యమ్మకి ఓనా మాలు కూడ రావంట."

"మరియ్యన్నీ ఎట్టా తెలుసు?"

"సదువుకున్నోళ్లకి ఇయ్యన్నీ తెలీ సంటుంది. సదువులో ఇయ్యన్నీ సెప్ప సంట."

"మరి నిన్నెందుకు చదివిస్తోంది?"

"సదువుకుంటే మారాజాలా బతకొ వ్వంట."

"సదువుకుంటే నీ కులం మారుద్దా?"

"తెల్దు. నా కేటీ తెల్దు. సన్నిసిగించ మాకు." మనసుకి మరి సమాధానం చెప్పలేక విసుక్కున్నాడు సత్తిరాజు.

* * *

"ఏట్రా ... బడొగ్గిగానే ఇంటి కెలిపోరాక ఏడ తిరుగుతుండావు?"

"......"

"ఓరి, సత్తిగా! ఏట్రా ముంగినా కూకున్నావు? ఎల్లి మొకం కడుక్కోర సద్దికూ డెడతాను ... ఇదుగో బేగి రా .. ఇగురు సేసానురా నీ కిష్టవని."

"నాకొద్దు ..." సందుగు పెట్టె మీద కూర్చుని, మోకాళ్ల మీద మోచేతులు ఆన్చి అరచేతుల్లో చెంపలు ఇరికించి నేల చూపులు చూస్తూ అన్నాడు.

"ఏట్రా ... ఏటైనాది? పంతులోరు ఏటన్నా అన్నాడా? సెప్పు ...'

"ఏటీనేదు." మొహం గోడవేపు తిప్పుకున్నాడు.

"బేగి రారా ... ఇగురు సల్లారి పోతున్నాది."

"నాకే టొద్దు ... నాను వణ్ణం తిన్ను."

"ఏటి కావాలో సెప్పు."

"తెల్గు పుస్కం ఊళ్లో కొచ్చిందని అయ్యోరు సెప్పేరు. పైసలుంటే ఇయ్యి. తెచ్చుకుంటాను."

"నా కా డేదుండాయిరా ... సెప్తే సునిపించుకోవు."

"మర్రైతే బడికెల్లను."

"ఏట్రోయ్! పుస్కం నేకపోతే బళ్లోకి రానివ్వ ర్రేట్రా?"

"మరేటి సదవ మంటావే?"

"ఇన్ని పుస్కా లుంటాయంటే అస్సలు సదువే సెప్పించక పోదును. ఏదో నాలు గచ్చరం ముక్కలు నేర్చుకుంటావనీ, బాగుపడతావనీ అనుకున్నాను నాను. ఇలాగైతే నాను సదివించలేన్నా, సత్తి. పోన్లేరా ... అనక సూద్దాంగానీ .. నా బాబువి. మంచోడివి. వణ్ణం తిన్నా. నేకుంటే పిత్తం ఎలిపొస్తదిరా" అంటూ సిల్వరు గిన్నెలో అన్నం, ఇగురు వేసి తీసుకొచ్చింది.

సత్తిరాజుకి ఇగురు చూడగానే ఆకలి పుట్టుకొచ్చింది. నోరూరింది. వెంటనే కింద కూర్చున్నాడు.

"నా బాబే! సగ్గా రేపు యినాయక సవితి. రేపు బేగి నేసి తలంటోసుకుని చిల్కా సొక్కా ఏసుకుందువు గాని మర్రోజే, రేపు నీ పుట్టిన్రోజురా, సత్తిగా." పోయినేడు అప్పలాసారి గోరి పెదబాబు పాత సొక్కా సోడాగుండేసి ఉతికి నీ పుట్టిన్రోజు కేసినాన్రా. అయ్యోరి నిచ్చు సూత్తే నా కల్లంట నీళ్లు తిరిగినాయి, మంచి సొక్కా కొన్నేక పోయానే అని." కళ్లలోంచి కారుతున్న కన్నీ రద్దుకుంది.

"నా కీపాలి సొక్కా వొద్దునేవే ... పుస్కం కొనుక్కుంటానే ... సర్పేదే ... ఈ సొక్కా కేవే ... దరిజాగా ఉన్నాది. కూసింత సిరిగింది. అంతే గదేంటి?" అంటూ కళ్లు తుడుచుకున్నాడు.



మాతృమూర్తి
చిత్రం— వి. విజయలక్ష్మి (ఖమ్మం)

సంబరంగా చెబుతూ నుదుటి మీద చిందర వందరగా పడ్డ వెంట్రుకల్ని పైకెగదోసింది.

"సొక్కాకి డబ్బులేడనే!" చేతిలోకి అన్నం ముద్ద తీసుకుంటూ అడిగాడు సత్తిరాజు.

"పోగుసేస్తా్రనా" అంటూ నాలి క్కరుచుకుంది.

"అత్తైతే డబ్బుల్లేవంటూ బొంకావు." చేతిలోకి తీసిన ముద్ద గిన్నెలో పడేసి లేచి సందుగు పెట్టెక్కి కూర్చున్నాడు.

"సిక్కోసవేంరా, రేపు నీ పుట్టిన్రోజురా. సూడు, ఈ సొక్కా ఎట్టా సిరిగిపోనాదో.

అవి కన్నీళ్లు కావు. ఆనంద బాష్పాలు. సొక్కా లేదని కాదు. పుస్తకం కొనుక్కో వచ్చుగదా అని.

"మా యమ్మ శానా మంచమ్మ. బేగి వణ్ణం ఎట్టవే. మల్లీ నేకపోతే పుస్కా లైపోతాయి."

ఏమీ అనలేక అసహాయంగా ఉండి పోయింది రావులమ్మ.

అన్నం పెద్ద పెద్ద ముద్దలుగా చేసి ఆబగా తింటున్నాడు సత్తిరాజు. ఆకలితో కాదు, ఆత్రతతో. అస అన్నం తిన కుండానే పోదా మనుకున్నాడు కాని, అన్నం తినకపోతే అమ్మ డబ్బులివ్వదని తెలుసు.

చెయ్యి చొక్కాకి తుడుచుకుంటూ, 'అమ్మా! బేగి డబ్బు లియ్యే. పుస్కం కొనుక్కొల్లి పోస్తానే. వెగొచ్చేస్తానే' అన్నాడు.

రావులమ్మ చీర చెంగున కొంగున ముడి విప్పి సత్తిరాజు చేతిలో పోసింది. ఆత్రంగా లెక్క చూశాడు సత్తిరాజు.

"రూపాయున్నరే ఉందేసి?" ఏడుకారి పోతూ అడిగాడు సత్తిరాజు.

"నాకా డంతే ఉంది ... ఏటి సేస కుంటావో సేస్కో." సత్తిరాజుకి ఆమె మాటల్లో అర్థం తెలిసింది కాని, ఆ మాటల వెనక బాధ తెలియలేదు.

సత్తిరాజు బుర్రలో మిగిలిన డబ్బుల ఎలా సంపాదించడమా అన్న ఆలోచన తిరుగుతూంది.

సత్తిరాజు అయిదో క్లాసు చదువు తున్నాడు. సత్తిరాజు మీద రావులమ్మ గంపెడాశ పెట్టుకుంది. రావులమ్మ మొగుడు సింహాచలం పట్నంలో రిక్షా లాగేవాడు. పట్నంలో సిటీ బస్సు లెక్కువై పోయాయి. కార్లెక్కువై పోయాయి. లారీ లెక్కువై పోయాయి. జనం ఎక్కువై పోయారు. కాని, రోడ్లు సన్నవై పోయాయి. మెయిన్ రోడ్డు గోచి గుడ్డలా సన్నగా, పొడుగ్గా తయా రైంది.

సూర్యనారాయణ బిల్డింగ్సు దగ్గర రోడ్డు మరీ సన్నమై పోయింది. రోడ్డిన్‌స్పెక్టర్లు సూర్యనారాయణ బిల్డింగ్సు సదడుగులు కొలుస్తూ న్నారు. సూర్యనారాయణకి ఆ బిల్డింగ్సులో ఓ సినిమా హాలు కూడా ఉంది. మంచి సెంటరు. నాలుగ్గొంగు బస్సుల దుకాణాలు ఉన్నాయి. పదడుగులు ముక్కా పోతే మిగిలేది చిప్పేనని సూర్యనారాయణకు తెలుసు.

సూర్యనారాయణ కాగితాలు అటూ ఇటూ కదిలాయి. మరి వాటిని కదల్నివ్వ కుండా సూర్యనారాయణ దొంతి పెట్టే శాడు. దొంతి కింద కాగితాలు చెత్తబుట్టలోకి, కాగితాల మీద దొంతి ఇన్‌స్పెక్టర్ల పొట్టల్లోకి వెళ్లిపోయాయి.

సూర్యనారాయణ బిల్డింగ్సులో పదడుగులు కాదు గదా—పదో వంతు ముక్కైనా మున్సిపాలిటీ చెత్త లారీలు ఎత్తుకు పోలేదు.

అల్లదుగో అక్కడే మరీ గోచి ముక్కై సన్నమై పోయింది. అది మరీ బిజీ సెంటరు.

ఆ బిజీ సెంటర్లోనే సింహాచలం రిక్షా పక్కనున్న రుబ్బురోలు ఆడ మనిషికి తగలకుండా పక్కకి తప్పించి పదో నంబరు బస్సు కిందికి పోనిచ్చేసేడు. వాడు పోనివ్వలేదు. ఆ ఆడమనిషి

మోచెయ్యి తగిలే రిక్షా పక్కకెళ్ళి పోయింది. అలా జరిగిందని చెప్పడానికి మరి సింహాచెలం లేడు.

పదో నంబరు బస్సు కింద చిక్కటి, కల్తీలేని ఎర్రని రక్తంలో మునిగి తేలుతున్న సింహాచెలం రావులమ్మకి అన్యాయం చేసి వెళ్ళిపోయేడు.

తన కొడుకు తన సింహాచెలంలా రిక్షా లాక్కూడదనీ, పెద్దగా సదువుకుని లచ్చనంగా ఆపీసులో కాయితాల్మీద రాసుకుంటూ కూకోవాలనీ కలలు కంటుంది రావులమ్మ. రావులమ్మ కలలు పండించాలనే ఉద్దేశంతో కాకపోయినా, సత్తిరాజు చదువుకోవాలనే ఉద్దేశంతోటే శ్రద్ధగా బడి కెళుతున్నాడు. అంతవరకూ సెకండ్ హాండ్ పుస్తకాల మీదే నెట్టుకొచ్చేడు.

కానీ, ఈ ఏడు తెలుగు పుస్తకం మార్చేసేరు. ఆ పుస్తకాలు షాపుల్లో తప్ప మరెక్కడా దొరకవు.

సత్తిరాజు లాంటి సెకండ్ హాండ్ బతుకులు ఎన్నో ఉంటాయన్న విషయం పాపం, ఆ పుస్తకాన్ని మార్చేసిన పెద్ద మనుషులకి తెలియకపోవచ్చు.

చదువుకోవాలని ఆశపడే సత్తిరాజుని పుస్తకం లేకపోతే క్లాసుకి రావద్దనే పంతులుగారికి కూడా తెలిసిరాలేదు సత్తిరాజు లాంటి వాళ్ళ బతుకు.

సత్తిరాజుకి నిజంగా నిన్న మొన్నటి వరకూ తను తొడుక్కున్న చింకిచొక్కా మీద చెప్పలేని కోపం ఉండేది. ఎలాగైనా సరే కొత్త చొక్కా కొనుక్కోవాలనే కోరిక కూడా ఉంది. దగ్గర్లో తన పుట్టిన రోజు ఉందన్న విషయం కూడా తెలుసు. అమ్మ చొక్కా కొంటుందేమో నన్న ఆశ కూడా ఉంది.

చెట్టు మీద పిట్టల్ని ఉత్త చేత్తో ఎగర గొట్టేసినట్టు సత్తిరాజు కోరిక, ఆశ, కోపం—అన్నీ పుస్తకం లేకపోతే క్లాసుకి రావద్దన్న పంతులుగారి మాటతో ఎగిరిపోయేయి.

తెల్లారితే వినాయక చవితని చెప్పడానికి పెద్దగా ఆలోచించక్కర్లేదు. ఎందుకంటే, మార్కెట్టు ముందు మట్టి ముద్దల్ని పిసుకుతూ, వినాయకుడి బొమ్మ అచ్చుల్లో ఆ మట్టి ముద్ద పెట్టి బొమ్మలు తయారు చేస్తున్న మనుషుల్ని చూస్తే చాలు.

ఆ బొమ్మల్ని చూస్తే రేపు పండగన్న విషయం కన్నా, అవి ఇంటింటా పట్టుకెళ్ళి అమ్మితే తనకి డబ్బు లిస్తారన్న విషయం గుర్తు కొచ్చింది సత్తిరాజుకి.

ఆలోచన వచ్చిందే తడవుగా ఓ మనిషితో మాటాడి పీట మీదికి ఓ పాతిక బొమ్మలు ఎత్తుకుని బయలు దేరేడు సత్తిరాజు.

సత్తిరాజు మొహం తెలియకపోయినా ఆ బొమ్మల వాడు అమ్మమని ఇచ్చాడు. సత్తిరాజు ఒకవేళ ఆ బొమ్మలు పట్టుకుపోయి అమ్మి, డబ్బులు తీసుకు రాకపోతేనో, కమీషన్ కాక మొత్తం అంతా పట్టుకుపోతేనో — ఇలాంటి ఆలోచన సత్తిరాజుగ్గానీ, ఆ బొమ్మల మనిషికి గానీ రాలేదు. రాదు. ఎందుకంటే, వాళ్ళిద్దరూ ఒకే కులం వాళ్ళు. గంజికి కూడా మొహం వాచే కులంవాళ్ళు. ఒకవేళ సత్తిరాజు అలాంటి చెడ్డపని చేసినా, అతని చింకి చొక్కా అతనికి ఎదురు సాక్ష్యం చెపుతుంది.

మనిషి మీద మనిషికి నమ్మకం ఆ కులంతోనే ఉంది. అందుకే వాళ్ళకి గంజినీళ్ళు కూడా లేవు.

రోడ్లన్నీ చీకటితో నిండిపోయేవరకూ తిరిగి తిరిగి కాళ్ళీడ్చుకుంటూ మార్కెట్టు దగ్గరి కొచ్చేడు సత్తిరాజు. బొమ్మ లమ్మిన మొత్తమంతా బొమ్మలాసామి చేతిలో పోసేడు. తనకి రావలసిన కమీషను తీసుకున్నాడు.

కాని, సత్తిరాజు మొహంలో చిరునవ్వు వెలగలేదు. దుఃఖం ఆగలేదు.

"రేపు పొద్దుటే మా ఇంటికొచ్చి బొమ్మ తీసుకెళ్ళు. అల్లా సందులో గోపాలసెట్టిగారిదే మా ఇల్లు" అని చెప్పి వెళ్ళిపోయాడు బొమ్మల వాడు.

సత్తిరాజు ఇంటి ముఖం పట్టాడు.

రావులమ్మ వెండేలుపటిపోయా గుడిసె లోంచి బయటికి, మళ్ళా గుడిసెలోకి ఎన్నిసార్లు తిరిగి ఉంటుంది.

'సత్తిగాడు డబ్బులు సాలవంటూ ఎల్లిపోనాడు. మళ్ళీ రానేదు. ఏడకెల్లాడో ఏ౦' అనుకుంటూ గుమ్మంలోనే నిలుచుంది రావులమ్మ.

దూరంగా కాళ్ళీడ్చుకుంటూ వస్తూన్న కొడుకుని చూసేసరికి రావులమ్మకి ఏనుగెక్కినంత సంబరం కలిగింది.

సత్తిరాజుకి ఆ రాత్రి నిద్ర పట్ట లేదు. గోనెపట్టా మీద పడుకుంటే చిరాకనిపించింది. అసలీ నిద్రపోవడం ఎందుకనిపించింది. అసలీ రాత్రెందు కని పించింది. మరో నిమిషంలో తెల్లారిపో కూడదా అనిపించింది. రేపు పండగ పెట్టుకొని బొమ్మలు కొనుక్కోకుండా ఏం మనుషులు ఉండగలరేం అని పించింది.

ఏం అనిపించినా, సత్తిరాజుకి రేపు తెల్లారేక బొమ్మ లమ్ముకోవడం తప్ప మరేం మార్గం కనిపించలేదు.

తెల్లారితే కాకుల గోల వినిపిస్తుంది. ఓ కాకి అరిచింది.

"ఉష్, పడుకో. అర్ధరాత్రి నీ గోలేమిటీ?" మరో కాకి కసిరింది.

సత్తిరాజుకి చిన్న కునుకు పట్టింది. పట్టిందనే అనుకున్నాడు. మళ్ళీ తెలివి వచ్చేసింది.

పక్కింటి కోడి అరిచింది. బాగా తెల్లారిపోయిం దనుకున్నాడు. ఎందుకంటే, అదెప్పుడూ పట్టపగలే అరుస్తుంది.

రావులమ్మ ఇంకా పడుకునే ఉంది. సత్తిరాజు మెల్లగా లేచి బయటపడ్డాడు. రోడ్డు మీద దారి పొడుగునా మ్యునిసిపాలిటీ ఎలక్ట్రిక్ స్తంభా లున్నాయి. ఎందుకూ? చీకట్లో లారీలు వాటిని గుద్దుకోవటానికి. వాటికి బల్బులున్నాయి. కాని, అవి వెలగటం లేదు. రాత్రి పది దాటితే ఆర్పేస్తారు.

గుడ్డి చంద్రుడు కునుకుతున్నాడు, నైట్ డ్యూటీ సరిగా చెయ్యలేని పచ్చి దద్దమ్మలా. సత్తిరాజుకి ఆ చీకట్లో మార్కెట్టు వరకూ వెళ్ళడం మహా కష్టమయింది. అక్కడి నుంచి ఎదురుగా కనిపించే సందులోకి నెమ్మదిగా నడిచేడు.

నిజానికి సత్తిరాజుకి తొగరుచెట్టేదో తెలియదు. రాత్రి నా దళాగంటే బుర్రూపేసేడు కానీ, ఇప్పుడు ఆ చీకట్లో తొగరచెట్టు కనుక్కోవడం ఎలాగనే ప్రశ్న ఎదురైంది. ప్రశ్నకి జవాబు తట్టేలోగానే సత్తిరాజు సందులోకి వెళ్ళి, ఓ చెట్టు దగ్గర తలుపు తట్టేడు.

బొమ్మలాసామి ఆవులిస్తూ లేచి ఈ పిచ్చిమాలోకాన్ని చూసి నాలుగు తిట్టి, పీట నెత్తిన పెట్టి పొమ్మన్నాడు.

తిడితే తిట్టాడులే, పీట నెత్తిన పెట్టాడుగా అనుకుంటూ బయట పడ్డాడు సత్తిరాజు.

రాత్రి అమ్మిన వీథులు కాక, మరో వీథుల్లో తిరుగుతూ బొమ్మ లమ్మాడు. సత్తిరాజు ఒక్కడే రోడ్ల మీద పిచ్చి కుక్కలా అరుస్తూ తిరిగాడు.

కునుకుతున్న గుడ్డి చంద్రుడు గుబురుగా ఉన్న మేఘాల మధ్య కెళ్ళిపోయేడు. చిక్కటి చలిగాలి వీచింది ఒక్కసారి. సత్తిరాజు చింకి చొక్కా గాలికి రెపరెప లాడింది.

చిన్న తుంపర మొదలైంది. వాన పెద్దదవుతుందేమో అని భయం వేసి



జలక్రీడలు
ఫోటో— రంజిత్‌కుమార్ (మెదక్‌పూర్)

పక్కనే ఉన్న గట్టెక్కేసేడు సత్తిరాజు. అక్కడ కూడా సత్తిరాజుకి పూర్తిగా నిలవ నీడ లేకపోయింది. మరో గుమ్మం మీదకు వెళదామంటే వాన ఎక్కువై పోయింది.

బొమ్మలు తడిసి ముద్దైపోతే మన్నే మిగులుతుంది. సత్తిరాజు గబుక్కున తన చింకిచొక్కా విప్పి బొమ్మల మీద కప్పేడు.

దీనంగా ఆకాశం వేపు చూసేడు. దేవుడు కనికరిస్తాడేమో అని కాదు, మబ్బులు చెదిరిపోతున్నాయేమో అని.

చొక్కా కింద ఉన్న బొమ్మ దేవుడు కనికరించి వాన ఆపలేదు. వాన పడుతూనే ఉంది. చలిగాలి కొడుతూనే ఉంది. సత్తిరాజుకి వెన్నెముకలో ఏదో పాకిన ట్లనిపించింది. చలి ... గడగడ వణికేడు సత్తిరాజు.

మరో పది నిమిషాల్లో వాన ఆగింది. ఎవరూ ఆపలేదు. అదే ఆగింది. భర్త పోయాడని ఏడ్చి ఏడ్చి కళ్లతో నీళ్లన్నీ కారిపోయిన వెధవ ముండ మొహంలా ఉంది ఆకాశం.

పరామర్శ కొచ్చి నీరుకారిపోయిన మనిషిలా ఉన్నాడు చంద్రుడు.

సత్తిరాజు తడిచొక్కా వేసుకుని పీట నెత్తిన పెట్టుకొని మళ్లీ బయలు దేరేడు.

ఆ బయలుదేరడం బయలుదేరడం తిరిగి తిరిగి కాళ్లరిగి పీట మీద మట్టి దేవుళ్ళు తరిగి తరిగి మార్కెట్టు వేపు నడిచేడు సత్తిరాజు.

సత్తిరాజుకి నీరసంగా లేదు. నిద్ర లేక కళ్ళు వాచి ఉన్నా బాధనిపించలేదు. కాళ్లలో నొప్పిగా లేదు. చొక్కా తడిసి ముద్దైనా చలి వెయ్యడం లేదు.

ఆనందంగా ఉంది, తనకి కావలసిన డబ్బులు దొరికినందుకు.

సత్తిరాజు తిన్నగా ఇంటికి వెళ్లలేదు. డబ్బులన్నీ పోగుచేసి మరో మారు లెక్క పెట్టుకున్నాడు. మూడుంపావలా ఉంది. చాలు. పుస్తకం కొనడానికి ఆ డబ్బులు చాలు. తనకీ కొత్త తెలుగు పుస్తకం వస్తుంది. పంతులుగారు తనని క్లాసుకి రానిస్తారన్న ఆనందం అతన్ని ఉరకలు వేయిస్తోంది. పుస్తకాల షాపువేపు వేగంగా నడుస్తున్నాడు.

షాపు దగ్గరి కొచ్చేసింది. షాపు గుమ్మం కొనే ఆగిపోయేడు. షాపులో జనం ఎక్కువగానే ఉన్నారు.

షాపులో ఎదురుగా వేలాడదీసిన బల్ల మీది అక్షరాలు సత్తిరాజుని చూసి గర్వంగా నవ్వినట్లు అనిపించింది.

మరో మారు ఆ ముత్యాల సరాలు చదివాడు సత్తిరాజు బయటికే:

“చింకిచొక్కాతోనైనా గడుపుకుని మంచి పుస్తకం దొరికితే కొనడం మానకు.”

మరోమారు, మరోమారు చదివాడు సత్తిరాజు. తరవాత తన చింకిచొక్కా వేపు చూసుకున్నాడు. అప్పటికే అది ఎండకి అక్కడక్కడ కొస్త కొస్త ఎండింది. కాని, మట్టి దేవుళ్ల మట్టి అంటుకుంది.

సత్తిరాజు మరో మారు జేబులో డబ్బులు చూసుకుని మెల్లగా షాపులోకి అడుగు పెట్టేడు.

జనం ఎక్కువగా ఉన్నారు. వాళ్లందర్నీ దిత్తరపోయి చూస్తున్న సత్తిరాజు— “ఎవడ్రా వెధవ ... ఫో బయటికి ... దొంగ రాస్కెల్” అన్న కేకకి కదిలి పోయేడు కాని, చెదిరిపోలేదు.

“మరేనండి ... మరేనండి ...ఐదవ తరగతి తెలుగు ...” సత్తిరాజు మాట పూర్తి కాలేదు.

కొనిద్దామనుకున్నాడు. కాని, షాపు వాడు కానివ్వలేదు.

“చూసేరా ... దొంగవెధవ .. ఎంత ఎత్తు వేసేడో! మనం చూస్తే ఏదో పుస్తకం ఉందా అని అడుగుతారు. లేకపోతే ఎవరి జేబో కొట్టేసి పక్కా పోతారు... దొంగ వెధవలు ... పిల్ల నంచేనండీ దేశం పాడైపోతోంది.” కస్సు మరుతో అని, “ఫో, వెధవా... బయటికి ఫో. మెడపట్టి గెంట మంటావా?” అని ఉరిమాడు సత్తిరాజు మీద.

సత్తిరాజు మెల్లగా వెనక్కి వెనక్కి అడుగులు వేస్తూ గుమ్మం బయటికి వచ్చి మరీ బెరుగ్గా మొహం పెట్టి నిలుచున్నాడు.



కుటీర ప్రాంగణం
చిత్రం—శ్రీ. గోపాలరావు (గుంటూరు)

అంతలో అక్కడికి ఒక పెద్ద పడవ లాంటి కారొచ్చి ఆగింది. కార్లోంచి తొమ్మిదేళ్ల కుర్రాడు అప్పుడే గాలి ఊదిన బంతిలా బయటికి గెంతాడు. ఆ కుర్రా డేసుకున్న సిల్కు చొక్కా గాలికి రెపరెపలాడింది. మొహం మీద ముంగుర్లు దోబూచులాడేయి. కుర్రా డేసుకున్న బూట్లకి అద్దాలు అమర్చే రేమో అనుకున్నాడు సత్తిరాజు. అవి నిగనిగ మెరుస్తున్నాయి. పొట్టి గళ్ల నిక్కరు తెల్లటి తొడల్ని కావలించు కుంది.

ఆ కుర్రాడి మాటలో వీణ మీటితే వినిపించే మాధుర్యం ఉంది.

“ఏం కావాలి, బాబూ?” దొంగ వీణ శ్రుతి మార్చింది.

“ఐదవ క్లాసు పుస్తకం ఉందా?” మాధుర్యం ఉట్టిపడింది.

సత్తిరాజు బయట నిలబడి చూస్తూనేవున్నాడు.

“ఉంది, బాబూ ... ఇదుగో.” దొంగ వీణ గొంతు బొంగురుపోయింది.

“ఇక్కడ చిరిగిపోయిందే ... మరో టివ్వండి.” మళ్లీ దొరబాబు.

“మరి కాపీల్లేవు, బాబూ ... ఊళ్లో కూడా ఎక్కడా లేవు. ఓ పావలా తగ్గించి మూడ్రూపాయలే ఇవ్వండి.”

“వద్దు... చిరిగిపోయింది నా కొద్దు. మా ఊరినుంచి తెప్పించుకుంటాను.” దొరబాబు పుస్తకం అక్కడ పడేసి కార్లోకి తుర్రున పారిపోయేడు. కారు కదిలిపోయింది మెత్తగా.

షాపులో జనం పలచబడ్డారు. మరో పది నిమిషాల్లో జనం పూర్తిగా వెళ్లి పోయేరు. కాని, సత్తిరాజు కదలలేదు. షాపువాడు సత్తిరాజు వేపు చూసేడు. సత్తిరాజు షాపువాడిని చూసేడు.

“పుస్తకం కావాలా?” గొంతులో అర్థింపు లేదు; ఆప్యాయత లేదు. అధి కారం ఉంది. అహంకారం ఉంది.

కావాలన్నట్లు బుర్ర ఊపేడు సత్తి రాజు, కాని, ముందుకి కదంలేదు. కదిలితే ఎక్కడ తన్నుతాడో అని భయం.

“డబ్బు తెచ్చావా?”

తెచ్చానన్నట్లు తల ఊపాడు సత్తి రాజు.

“ఊఁ... తియ్యి ... ఏదీ మూడుం పావలా ...” ‘పావలా’ ఒత్తిపలుకుతూ అన్నాడు షాపువాడు.

సత్తిరాజు డబ్బులిచ్చేసి చిరిగిపోయిన పుస్తకం తీసుకొని ఆనందంగా ఓ మారు ఎదురుగా ఉన్న గోడ వేపు చూసేడు. అక్కడ వేలాడగట్టిన బోర్డు గాలికి ఊగింది. అదే గాలి సత్తిరాజు చింకి చొక్కాని కూడా ఊపింది. ★